క్లుప్తంగా

పనుల్లో పురోగతి సాధించాలి

● డ్వామా పీడీ వెంకటరమణయ్య



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కల్లూరు: ఉపాధి హామీ పనుల్లో పురోగతి సాధించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సూచించారు. బుధవారం ఆయన కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఫాంపాండ్స్, హార్టికల్చర్, వేతన దారులకు కల్పిస్తున్న పని దినాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, ఏపీఓ రమాదేవి, ఈసీ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పంట బీమా చేసుకోవాలి



పోలకల్‌లో రైతులకు పంట బీమాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకున్న పంటలకు బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు సాగు చేసుకుంటున్న పత్తి పంటలను పరిశీలించి సస్యరక్షణ పద్ధతులను తెలియజేశారు. అనంతరం గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి వ్యవసాయ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీఏఏ ఆఫ్రీన్, ఎంపీఈఓలు వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



తిమ్మందొడ్డిలో నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాసులు

సి.బెళగల్: గ్రామాల్లో జరుగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన ఏఈ గోనేనాయక్‌తో కలిసి మండల పరిధిలోని సి.బెళగల్, తిమ్మందొడ్డి గ్రామాల్లో జరుగుతున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్లకు సలహాలు, సూచనలు చేశారు.

రసం పీల్చే పురుగు ఉధృతిని నియంత్రించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఓర్వకల్లు: పత్తి పంటలో రసం పీల్చే పురుగు ఉధృతిని నియంత్రించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి మధుమతి సూచించారు. బుధవారం ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన పత్తి, మొక్క జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైర్లకు రసం పీల్చే పురుగు ఉంటే వాటి నియంత్రణకు 1 గ్రాము కాన్ఫిడార్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి కాండం వద్ద 40 రోజులకు ఒకసారి, 60 రోజులకు మరోసారి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, భాస్కర్ పాల్గొన్నారు.

చిన్న పాటి వర్షానికే వీధి రోడ్లు జలమయం



తమ్మరాజుపల్లెలోని ఓ వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీళ్లు

పాణ్యం: మండలంలో రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపాదడపా చిన్నపాటి చినుకులతో ప్రజల రాకపోకలతో అవస్థలు పడుతున్నారు. తమ్మరాజుపల్లె గ్రామంలో చిన్న పాటి వర్షానికే వీధులు జలమయం అయ్యాయి. వర్షపునీళ్లు వెళ్లేందుకు మురుగు కాలువలు లేకపోవడంతో నీరు రోడ్లపైనే నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. తాగు నీరు కూడా కలుషితం అవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని మురుగు కాల్వలు నిర్మించాలని వారు కోరుతున్నారు.



కోడుమూరులోని కోటవీధిలో వెలసిన పీర్లస్వాములు



సి.బెళగల్‌లో పీర్ల పెట్టెల ఊరేగింపు

కొలువుదీరిన పీర్లు

కోడుమూరు రూరల్/సి. బెళగల్: మొహర్రం పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో పీర్ల సందడి మొదలైంది. గత నెల 26వ తేదీ నెలవంక దర్శనం ఇవ్వడంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. కోడుమూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పీర్లచావిడ్లలో పీర్లను కొలువుంచారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మొదటి నెల మొహర్రం. ఇదే నెలలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానం జరిగింది. దీంతో ఆయన జ్ఞాపకార్థం పది రోజుల పాటు సంతాప కార్యక్రమాలు జరుపుకుంటారు. ఇందులో భాగంగా ఊరూరా పీర్ల చావిడ్లలో పీర్ల దేవుళ్లు కొలువుదీరి పూజలందుకుంటాయి. కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, కర్నూలు మండలాల్లో మొహర్రం సందర్భంగా మతసామరస్యం వెల్లివిరుస్తుంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆయా గ్రామాల్లో జరిగే పీర్ల ఊరేగింపును తిలకిస్తారు. 4వతేదీ శుక్రవారం చిన్న సరిగెత్తు, 6వ తేదీ ఆదివారం పెద్ద సరిగెత్తు, 7వతేదీ సోమవారం పీర్లదేవుళ్లు ఏటికి వెళ్లడంతో మొహర్రం ఉత్సవాలు ముగుస్తాయని పీర్ల చావిడ్ల నిర్వాహకులు తెలిపారు.



గొల్లలదొడ్డిలో చందమామయ్య పీర్ల చావిడిలో కొలువైన వివిధ పీర్ల స్వాములు

ప్రజలను అప్రమత్తం చేయండి

● ఎంపీపీ ఉసేన్‌బీ



మాట్లాడుతున్న అధికారులు

పాణ్యం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు పాల్గొన్నారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిపై వివరించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ వర్షాలు ప్రారంభం కావడంతో తాగు నీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించాలన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల శాతం పెరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతతోపాటు మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించేలా పర్యవేక్షించాలన్నారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కల్లూరు: ఈనెల 7న ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సమితి రాష్ట్ర కార్యదర్శి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ చిన్న మాదిగ, జిల్లా అధ్యక్షులు భాస్కర్ సూచించారు. బుధవారం అబ్దుల్లా బీఈడీ కళాశాలలో మండల ఇన్‌చార్జ్ ఎం.రమేష్ మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం కాకుండా అనేక సంక్షేమ పథకాల కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమాలు చేసి సాధించిందన్నారు. సమావేశంలో నాయకులు మహేంద్ర, చిన్న బజారి, ప్రభుదాసు, రాజేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

కల్లూరు: టీబీ పరీక్షలు చేయించుకోవాలని కల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోతీలాల్ నాయక్ సూచించారు. బుధవారం బొల్లవరం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, బరువు తగ్గిపోవడం తదితర లక్షణాలు ఉన్నవారితోపాటు మద్యం అలవాటు ఉన్నవారు, పౌష్టికాహార లోపంతో బాధపడే వారు గళ్ల పరీక్ష, ఎక్స్‌రే చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడి నయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సంపత్, మంజుల, సీహెచ్‌ఓ సురేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య

కోడుమూరు రూరల్: కర్నూలులో సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 28, 29, 30వ తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య కోరారు. బుధవారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రయ్య మాట్లాడుతూ కర్నూలు నగరంలో మూడురోజుల పాటు జరిగే సీపీఐ జిల్లా మహాసభల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై విస్తృతంగా చర్చించడం జరుగుతుందన్నారు. సభలకు జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మండల కార్యదర్శి రాజు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు బజారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం

కర్నూలు(రూరల్): వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనరు మోహన్‌బాబు అన్నారు. మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో బుధవారం కలిసొద్దాం కార్యకర్తను కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. అనంతరం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తెనే సురేష్, ఆర్.యేసెప్పు, వి.రామకృష్ణ యాదవ్, గౌతమ్ రియాజ్, రెడ్డిపోగు చందు, సుభాష్ బాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

● ఏడీఏ సాలురెడ్డి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కల్లూరు: పంటలలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్య రక్షణ పద్ధతులు పాటించాలని కర్నూలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) సాలురెడ్డి సూచించారు. బుధవారం చిన్నటేకూరు, పెద్దటేకూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు ఒప్పంద పత్రాలు పొందాలన్నారు. కౌలు కార్డు వల్ల ప్రభుత్వ సబ్సిడీలు, పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నటేకూరు, పెద్దటేకూరు గ్రామాల సర్పంచ్‌లు లక్ష్మన్న, పద్మావతి, ఎంపీటీసీలు సామన్న, మునిస్వామి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వలి, సుజాత పాల్గొన్నారు.

కేసు నమోదు

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన కొమ్ముశేఖర్, కొమ్ము మహేష్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు.ఎస్‌ఐ వివరాల మేరకు కొమ్ము శేఖర్ తాగుడుకు బానిసై తన భార్య రమాదేవిపై అనుమానంతో మానసికంగా వేదింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయంలో భార్య భర్తలు గత రెండు రోజుల క్రితం గొడవపడుతుండగా రమాదేవి తల్లి నారాయణమ్మ అడ్డు వచ్చింది. దీంతో కొమ్ము శేఖర్, కొమ్ము మహేష్.. నారాయణమ్మను కొట్టి చంపుతానని బెదిరించారు. నారాయణమ్మ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అంతా ఇష్టారాజ్యం



దిన్నెదేవరపాడులో మధ్యాహ్నం 3 గంటల సమయంలో సచివాలయానికి తాళం వేసి ఉన్న దృశ్యం

కర్నూలు(రూరల్): సచివాలయ ఉద్యోగులు విధుల నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలువురు సమయ పాలన పాటించడం లేదు. ఆలస్యంగా కార్యాలయానికి రావడం..ముందుగానే తాళం వేసి వెళ్లిపోవడం చేస్తున్నారు. దీంతో వివిధ పనుల మీద సచివాలయానికి వచ్చిన ప్రజలు ఉద్యోగులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామ సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకే సచివాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అంతా వారి ఇష్టారాజ్యమైందని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.

సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

వారాహి అమ్మవారికి నారికేళార్చన





సామూహిక కుంకుమార్చనలో మహిళలు(ఇన్‌సెట్) నారికేళాల అలంకరణలో వారాహి అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి అభిషేకం, నారికేళార్చన నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. లలితా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యాన వనాల అభివృద్ధికి చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో ఉద్యాన వనాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక 16వ వార్డు బుధవారపేటలోని దామోదరం సంజీవయ్య మైదానంలో నడకబాట, ఓపెన్ జిమ్, కిడ్స్ ప్లే, పచ్చదనం, సుందరీకరణ పనులను మంత్రి ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. బుధవారపేటలో జనాభా ఎక్కువగా ఉన్నా సేద తీరేందుకు ఆహ్లాదకరమైన ప్రదేశం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని చేపల గుంత మైదానంలో రూ.31.4 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. నగర పరిధిలో అన్ని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రాధాన్యత క్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పచ్చదనం పెంపునకు 4,800 మొక్కలు నాటించినట్లు చెప్పారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

● వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: నూతనంగా పదవులు పొందని వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీగా షేక్ మహమ్మద్ ఇలియాస్, సోషల్ మీడియా సెక్రటరీగా మాదాసు రాంగోపాల్, స్టూడెంట్ వింగ్ సెక్రటరీగా బోయ మహేంద్ర నియమితులయ్యారు. వీరు బుధవారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహరెడ్డిని స్వగృహంలో మర్యాపూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహులు, నాయకులు ఈశ్వరయ్య, రంగప్ప, శివారెడ్డి, శ్రీరాములు, అనుబంధ విభాగాల జిల్లా, నియోజకవర్గాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల మందులు వాడొద్దు



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏఓ దస్తగిరి రెడ్డి

కోడుమూరు రూరల్: పంటలకు మోతాదుకు మించి పురుగుల మందులు వాడరాదని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. బుధవారం మండలంలోని వెంకటగిరి, ఎర్రదొడ్డి గ్రామాల్లో రైతులతో కలిసి ఏఓ పత్తి,కంది పంటల సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంట సాగు చేసిన రైతులంతా ప్రతి రోజు పంటను పరిశీలిస్తూ ఉండాలని, రసం పీల్చే పురుగు, దోమ కనిపిస్తే వెంటనే వేపనూనెను స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు మండలంలోని జూలకల్, పొన్నకల్లు గ్రామాల్లో ఏఓ దస్తగిరి రెడ్డి బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అరకొర వర్షాలకు రైతులు పంటలను సాగు చేయరాదని, వర్షాలు సమృద్ధిగా పడిన తర్వాతే పంటలు వేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

సి.బెళగల్: అధికార యంత్రాంగం ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్లోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలు సంతృప్తిచెందేలా పనులు చేపట్టాలన్నారు. కొందరు అధికారులు తమ పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్ తదితరులు ఉన్నారు. అనంతరం కంబదహాల్ గ్రామంలో మండల అధికారులతో కలిసి ఆయన పర్యటించి గ్రామంలో చేపట్టే పారిశుద్ధ్య పనులను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ప్రజల ప్రాణాలు తీయొద్దు



తుమ్మలవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు(రూరల్): కర్నూలు-ఉల్లాల ప్రధాన రహదారిలో తుమ్మలవాగుపై నాసిరకంగా బ్రిడ్జి నిర్మించి ప్రజల ప్రాణాలు తీయొద్దని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. బుధవారం విద్యార్థిసంఘం నాయకులతో కలిసి పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామ ప్రజలు అనేక పోరాటాలు చేశారన్నారు. అయితే, నాసిరకం సిమెంట్, కడ్డీలు, ఇసుక వాడుతున్నారని చెప్పారు. భారీ వర్షాలు వస్తే వంతెన నిలబడదు అని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల పరిశీలన బృందంలో నాయకులు ప్రకాష్, అంజి, విశ్వనాథ్, రాము,సుధాకర్, రఘువరన్, హరి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సంచార వైద్య చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న డా.రఘు

ఓర్వకల్లు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంచార వైద్య చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. బుధవారం ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గ్రామ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో వర్షపునీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారిణి జానకి, ఆశా వర్కర్ వరలక్ష్మి, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.


అదనపు భూ సేకరణకు క్లెయిమ్స్ స్వీకరణ



రైతుల నుంచి స్వీకరించిన క్లెయిమ్స్ పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

పాములపాడు: నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనులకు సంబంధించి అదనపు భూ సేకరణ నిమిత్తం రైతుల నుంచి క్లెయిమ్స్‌ను ఆర్డీఓ నాగజ్యోతి స్వీకరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మాట్లాడుతూ జూటూరు గ్రామం వద్ద జరుగున్న హైవే పనులకు 3.805 ఎకరాలు అవసరముందన్నారు. భూమి యజమానులు 38 మందికి అవార్డు కాపీలను అందించామన్నారు. వీరంతా భూముల ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, పొలం పాసుబుక్కులతోపాటు 11 రకాల పత్రాలను అందించాలన్నారు. రైతుల నుంచి క్లెయిమ్స్ పత్రాలు స్వీకరించినట్లు వివరించారు. అలాగే జూపాడుబంగ్లా మండలంలో 1.07 ఎకరాల భూమి సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఆర్ఐ ఖాజాబీ, మండల సర్వేయర్ భాస్కర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై విచారణ



విద్యార్థుల తల్లిదండ్రులను విచారిస్తున్న ఎంఈఓ, ఎస్ఐ

బేతంచెర్ల: మండలపరిధిలోని కొమ్మురి కొట్టాల ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు నాగలక్ష్మమ్మను విద్యార్థుల తల్లి దండ్రుల సమక్షంలో ఎంఈఓ సోమశేఖర్, ఎస్ఐ రమేష్ బాబు బుధవారం విచారించారు. 37 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థులకు నాగలక్ష్మమ్మ అరకొరగా భోజనం పెట్టడమే కాకుండా పాఠశాలలో తాను చెప్పిన పని చేయకపోతే తిట్టడం లాంటి పనులు చేస్తోంది. ఎందుకిలా చేస్తున్నావని అడగటానికి వెళ్లిన విద్యార్థుల తల్లి దండ్రులతో గొడవ పడుతోంది. దీంతో తల్లి దండ్రులు రెండు రోజులుగా విద్యార్థులను పాఠశాలకు పంపకుండా మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సోమశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ రమేష్ బాబు, ఎంఈఓ వెళ్లి విద్యార్థులను, తల్లిదండ్రులను విచారించారు. కాగా, విచారణకు కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ సభ్యులు మాత్రమే వచ్చారని, గురువారం అందరితో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ఎంఈఓ వెల్లడించారు.